తాగునీటి ఇబ్బందులు రానీయొద్దు : డీపీవో



నవతెలంగాణ-పిట్లం

వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని జిల్లా పంచాయతీ అధికారి మురళి అన్నారు. శుక్రవారం పిట్లం గ్రామ పంచాయతీని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి, ఆయా వార్డులలో నీటి సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు ఆయా అవార్డులలో పర్యటించాలని అధికారులకు ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు మురికి కాలువలలో చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటి టాక్స్, వ్యాపార సముదాయాల నెలవారి బిల్లులతో పాటు, పెండింగ్ బిల్లులపై దృష్టి సారించి నెలాఖరులోగా వందశాతం బిల్లులను వసులు అయ్యేలా చూడాలని అన్నారు. అనంతరం పలు రికార్డులతో పాటు సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ బాలరాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల నిఘాలో మున్సిపల్

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. కార్యాలయంలో మొత్తం 29 కెమెరాలు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ రాజు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో సెక్షన్లవారిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అధికారుల పనితీరు, ప్రజల రాకపోకలు, వారి కదలికలు గమనంచనున్నట్టు తెలిపారు.



మున్సిపల్‌లోని వివిధ విభాగాల్లో అమర్చిన సీసీ కెమెరాలు

అంగన్‌వాడీలను వేధిస్తున్న సూపర్‌వైజర్ వాణిని సస్పెండ్ చేయాలి

- తన ఇంటి పనిచేయనందుకు విధుల్లో లోపాలంటూ వేధింపులు
- బాన్సువాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల ర్యాలీ
- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నా





సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టిన అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు.. ర్యాలీగా వస్తున్న అంగన్‌వాడీలు

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

అంగన్‌వాడీలను వేధిస్తున్న బాన్సువాడ డివిజన్ పరిధిలోని నసురుల్లాబాద్ సెక్టర్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు సురేశ్ గౌండ, ఖలీల్ ఆధ్వర్యంలో బాన్సువాడ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్‌లు.. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫిర్యాదు చేసి అక్కడి నుంచి బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు పెద్దఎత్తున ర్యాలీగా చేరుకొని ధర్నా చేపట్టారు. నసురుల్లాబాద్ బొమ్మన్ దేవ్‌పల్లి అంగన్‌వాడీ సెంటర్ టీచర్ సువర్ణ.. సూపర్‌వైజర్ వేధింపులను భరించలేక ఆత్మహత్యయత్నం చెశారని, వేధింపులకు గురి చేస్తున్న సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఖలీల్ మాట్లాడుతూ ఇంటి వద్ద వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని, అలా పని చేయనందుకు ఉద్దేశపూర్వకంగా వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు స్వయంగా తమ భర్తలకు భయపడడం లేదు గాని సెక్టార్ సూపర్‌వైజర్ కు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి పని చేయనందుకు అంగన్‌వాడీ టీచర్ సువర్ణను విధులను సక్రమంగా నిర్వహించలేదని, రికార్డులు సరిగ్గా లేవని వేధింపులకు గురి చేశారని, జీతం నిలిపివేస్తామని ఆమెపై వ్యక్తిగత దూషణలకు దిగినట్టు తెలిపారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై సువర్ణ ఫినాయిల్ మందు తాగారని, అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను గ్రామస్తులు బాన్సువాడ ప్రభుత్వాసు పత్రికి తరలించడంతో ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్టు తెలిపారు.

మానసిక క్షోభ పెట్టడంతో ఒత్తిడిని భరించలేక అంగన్వాడీ టీచర్ ఆత్మహత్య యత్నం చేసుకుందన్నారు. సువర్ణ టీచర్‌ను వేధింపులకు పాల్పడిన ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వాణిని సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ పరంగా ఏమైనా తప్పులు జరిగితే సంజాయిషీ అడగాలే గానీ వ్యక్తిగత దూషణలు చేయకూడదని అన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సువర్ణను జిల్లా సిఐటియు నేతలు సురేష్ గొండా, చంద్రశేఖర్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు పరామర్శించారు.

ఆత్మహత్య పరిష్కారం కాదు

- ఎలాంటి సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకురండి : సబ్ కలెక్టర్ కిరణ్మయి



సమస్యలు లేని మనిషి లేడని, సమస్యకు పరిష్కారం మాత్రం ఆత్మహత్య కాదని బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అన్నారు. అంగన్‌వాడీ టీచర్‌లు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టగా.. సబ్ కలెక్టర్ వారితో మాట్లాడారు. వేధింపులకు సంబంధించిన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తాను బాన్సువాడ డివిజన్ సబ్ కలెక్టర్‌ని అని, తాను ఓ మహిళనని మహిళా సమస్య ఉంటే నేరుగా తనకు కలవ వచ్చని అన్నారు. ఒక మహిళ సమస్య మరో మహిళ పరిష్కరిస్తుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు మూడు నుంచి ఐదు సంవత్సరాలు వరకు పసికూనలకు ధైర్యం చెప్పే టీచర్లు ఇలా అధైర్యపడి ఆత్మహత్య చేసుకోవడం సరికాదన్నారు.

రౌడీ షీటర్‌ల ఆగడాలపై నిఘా

- వారి కదలికలను కనిపెడుతూ ఉండాలి
- పలు పోలీస్‌స్టేషన్‌లను సందర్శించిన సీపీ సాయిచైతన్య
- రంజాన్ నేపథ్యంలో బందోబస్తు పర్యవేక్షించిన సీపీ



రికార్డులు తనిఖీ చేస్తున్న సీపీ సాయిచైతన్య



బందోబస్తు పర్యవేక్షిస్తున్న సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రౌడీ షీటర్‌లుగా నమోదైన వారిపై నిఘా పెడుతూ వారి కదలికలను ఎప్పకప్పుడు కనిపెడుతూ ఉండాలని సీపీ సాయి చైతన్య సూచించారు. వారి ఆగడాలను ఎప్పటికప్పుడు అరికట్టాలని ఆదేశించారు. శుక్రవారం నగరంలో సీపీ పర్యటించి బందోబస్తు పర్యవేక్షించారు. నార్త్ రూరల్ సర్కిల్ కార్యాలయం, 5వ పోలీస్ స్టేషన్‌లను గురువారం రాత్రి తనిఖీ చేసి పర్యవేక్షించారు. రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు. 5ఎస్ విధానం అమలు చేస్తున్నారా లేదా అడిగి తెలుసుకొని మొత్తం చూసారు. గంజాయి నిర్మూలనకు అధికారులకు ఆదేశాలు జారీచేయడం జరిగిందని, ఎవరయిన గంజాయికి బానిస అవుతే వారికి కౌన్సెలింగ్ చేయాలని తెలిపారు. దాని నిర్మూలనకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సైబర్ మోసగాండ్ల నుండి ప్రజలు మోసపోకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. గేమింగ్ యాప్‌ల పట్ల ప్రజలు మోసపోకుండా ఎప్పటికప్పుడు వారికి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సిబ్బంది సాధక బాధలు ప్రతీ ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఐదవ టౌన్ ఎస్ఐ గంగాధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

రంజాన్ మాసం చివరి శుక్రవారం (జుమత్తుల్ విధా) అయినందున ఏర్పాటు చేసిన బందోబస్తును సీపీ పరిశీలించారు. నిజామాబాద్ నగరంలో గల కచ్చియా మసీద్ నందు పరిశీలించి ముస్లింలు నమాజు చేసుకునేందుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా సజావుగా సాఫీగా జరిగే విధంగా అధికారులను పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ సాయి చైతన్య గాంధీ చౌక్, కిషన్ గంజ్ , మార్కెట్ క్లాక్ టవర్, నెహ్రూ పార్క్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఫుట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ.. ఎల్లప్పుడు ప్రజలు, పోలీస్ సిబ్బంది స్నేహ పూర్వకంగా సోదర భావంతో మెలిగి, అందరూ వారి, వారి కుటుంబసభ్యులతో సుఖ సంతోషములతో వర్ధిల్లి సమాజంలో శాంతి స్థాపనకు అందరు కృషి చేయాలి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏ.సి.పి రాజ వెంకట్ రెడ్డి, టౌన్ ఎస్ హెచ్ ఓ రఘుపతి, ట్రాఫిక్ సి ఐ ప్రసాద్ , ఎస్.ఐలు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలి

- ప్రభుత్వ సలహాదారు పోచారం, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- పనుల ప్రగతిపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్ధాపూర్ వద్ద చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సిద్ధాపూర్ రిజర్వాయర్ పనుల ప్రగతిపై శుక్రవారం జిల్లా కేంద్రంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్, ల్యాండ్ అండ్ సర్వే తదితర శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ డీ.ఎఫ్.ఓ వికాస్ మీనా, కామారెడ్డి ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న పనుల స్థితిగతుల గురించి అధికారులు పోచారం దృష్టికి తెచ్చారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. ఎలాంటి సాగునీటి వసతి లేని తండాలు, అనేక గ్రామాలకు ఈ రిజర్వాయర్ వరప్రదాయినిగా నిలువనుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన పనులను పూర్తి చేసేందుకు అంకిత భావంతో కృషి చేయాలని అధికారులకు హితవు పలికారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల విషయంలో క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఏర్పడినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఈ పథకం ప్రాధాన్యతను గుర్తిస్తూ, ఇప్పటికే సుమారు 280 పైచిలుకు ఎకరాల భూమిని కేటాయించినట్టు తెలిపారు. ఇంకనూ అక్కడక్కడా స్వల్ప మొత్తంలో అవసరమైన స్థలాన్ని కూడా కేటాయించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి వీలుగా విద్యుత్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని, పనులలో వేగాన్ని పెంచి నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. వివిధ ప్రాంతాలలో ఏక కాలంలో కొనసాగుతున్న పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ, నాణ్యతతో పనులు జరిగేలా చూడాలన్నారు. సమీక్షా సమావేశంలో ఎఫ్.డీ.ఓ భవానీ శంకర్, ఆయా మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ, ఇరిగేషన్, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం వర్తింపు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో అర్హత కలిగిన కుటుంబాలు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. అర్హత కలిగిన దరఖాస్తుదారులకు ఈ పథకం కింద రూ.20వేలఆర్థిక సహాయం అందజేయబడుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక జీవనాధారాన్ని కోల్పోయిన కుటుంబాలకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (NFBS) వర్తిస్తుందని అన్నారు. ప్రాథమిక జీవనాధార వ్యక్తి మరణించినట్లయితే, అతని వయస్సు 18 ఏళ్ల పైబడి, 60 ఏళ్లలోపు ఉండాలని అన్నారు. అర్హులైన వారు మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన కుటుంబాలు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు.

అరెస్టు చేసిన పంజాబ్ రైతులను విడుదల చేయాలి

- సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా
- రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అరెస్టు చేసిన పంజాబ్ రైతులను విడుదల చేయాలని ఎస్‌కేయం నిజామాబాద్ జిల్లా కమిటీ డిమాండ్ చేశారు. కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో శుక్రవారం ధర్నా చేశారు. నిరసనకు తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అధ్యక్షత వహించారు. అనంతరం రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాడం భూమన్న, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగాధర్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బాసెట్టి సాయి రెడ్డి, ఏఐకేఎం ఎస్ జిల్లా నాయకులు దుడ్డు గంగాధర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని పంజాబ్, హర్యానా రైతులు ఢిల్లీ నడిబొడ్డున పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తే పోరాటంలో 750 మంది రైతులు అమరులైనారని, ఆ పోరాటానికి నరేంద్ర మోడీ దిగివచ్చి ఆ మూడు చట్టాల్ని వెనక్కి తీసుకుంటున్నాను అని రైతులకు క్షమాపణ చెప్పి రాతపూర్వక ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. ఆ ఒప్పందాన్ని అమలు చేయాలని పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, కారుతో తొక్కి చంపిన వారిని శిక్షించాలని రాతపూర్వక ఇచ్చిన హామీని అమలు చేయాలని మూడవ దశ ఢిల్లీ రైతులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తే జగ్జీత్ దల్లేవాల్ నిరాహార దీక్ష చేస్తే ఆ నిరాహార దీక్ష శిబిరాన్ని ఎత్తివేసి ఆందోళన చేస్తున్న రైతులను అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపడం సిగ్గుచేటని మండిపడ్డారు. వెంట నే రైతులను విడుదల చేయాలని దేశ వ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా నిజామాబాద్‌లో ధర్నా నిర్వహించినట్టు తెలిపారు.



ధర్నా చేపట్టి నినాదాలు చేస్తున్న సంయుక్త కిసాన్‌మోర్చా నాయకులు

మోడీ సర్కార్ పెట్టుబడిదారులకు ఊడిగం చేసే విధంగా వ్యవసాయంలో సంస్కరణల వేగవంతం చేస్తూ రద్దు చేసిన మూడు చట్టాలను దొడ్డిదారిన మార్కెటింగ్ ప్రైవేట్ పేరుతో అమలు చేస్తున్నాడని అన్నారు. ఇప్పటికైనా నరేంద్ర మోడీ సర్కార్ రైతులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని రైతులకు మద్దతు ధర కల్పించాలని అరెస్టు చేసిన రైతులను, రైతు నాయకులను అందరిని విడుదల చేయాలని లేనియెడల మరో దఫా రైతులు ఉద్యమానికి శ్రీకారం చుడతారని నరేంద్ర మోడీ గద్దె దించడానికి రైతులు పూనుకుంటారని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాసంత జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మద్దతు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎర్ర సాయిలు, రాజన్న, ఐఎఫ్‌టీయూ నాయకులు శివ, టి యు సి ఐ నాయకులు సుధాకర్, ఐఎఫ్‌టియు నాయకులు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

కలెక్టరేట్ కార్యాలయం లోని శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో శానిటేషన్ కార్మికులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. 'నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ లో శానిటేషన్ నిర్వన కొరకు ఏజెన్సి ద్వారా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేయించుకోవడానికి నియమించుకున్న కార్మికులకు గత 3 ఏండ్లుగా పనిచేస్తున్నారు. చట్ట ప్రకారం కనీస వేతనాలు చెల్లించటంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా కార్మికులకు కనీస వేతనాలు పిఎఫ్, ఈ ఎస్ ఐ అమలు జరపటంలో కూడా నిబంధనాలు పాటించటం లేదు. గుర్తింపు కార్డులు, కార్మికులకు కనీస వేతనాలు , పిఎఫ్, ఈఎస్ఐ అమలు జరపటంతో పాటు, వారంతపు సెలవులను, పండగ సెలవులను అమలు జరపాలని, కార్మికులకు రక్షణ కల్పించి ఉద్యోగ బధ్రత కల్పించాలని' డిమాండ్ చేశారు. ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని, సమస్యలను పరిష్కారం చేయకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని తెఉలిపారు. సీఐటీయూ వినతి మేరకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అలకానంద, నవనీత, లక్ష్మి, పద్మ ,రమా, హేమా, సవిత, నర్సమ్మ, మీనా, ఆశ బాయి తదితరులు పాల్గొన్నారు.

ఉలిక్కిపడ్డ నగరం

- ఒకే రోజు మూడు హత్య కేసులు వెలుగులోకి
- కంఠేశ్వర్‌లో బాలుడు, పాంగ్రాలో మహిళ హత్య
- మరో ఘటనలో మహిళను హత్య చేసి కారుడిక్కీలో తీసుకెళ్లి కాలువలో పడేసేందుకు యత్నం
- కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



కారుడిక్కీలో మృతదేహం తరలిస్తుండగా పట్టుకొని విచారణ చేపడుతున్న పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఒకే రోజు మూడు హత్యలు చోటుచేసుకోవడంతో నగరం ఉలిక్కిపడ్డది. కంఠేశ్వర్ చౌరస్తా వద్ద రెండేండ్ల బాలుడు హత్యకు గురికాగా.. వినాయక్ నగర్‌లో ఓ మహిళను హత్య చేశారు. కాగా కంఠేశ్వర్ బైపాస్ వద్ద సైతం మరో మహిళను హత్య చేసి కాలువలో పడేసేందుకు కారు డిక్కీలో మృతదేహం తరలిస్తుండగా.. పోలీసులు పట్టుకున్నారు.

బాలుడిని బండరాయితో బాది..

నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో రెండేండ్ల బాలుడు హత్యకు గురై ఉండటంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మూడో స్టేషన్ ఎస్ఐ హరిబాబు, నగర సీఐ శ్రీనివాస్‌రాజ్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పక్కనే ఉన్న బండతో కొట్టి చంపి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. బాబు పేరు రాధేగా గుర్తించారు. బినోలి నుంచి తల్లిదండ్రులతో కలిసి భిక్షాటనకు వచ్చినట్టు సమాచారం. కాగా గురువారం రాత్రి బాబు అదృశ్యమైనట్టు ఒకటో పోలీస్ స్టేషన్‌లో తల్లి కమల ఫిర్యాదు చేసింది. శుక్రవారం ఉదయం హత్యకు గురై కనిపించాడు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేపటినట్టు సీఐ శ్రీనివాస్‌రాజ్ తెలిపారు.



మృతిచెందిన బాలుడు

మహిళను హతమార్చి.. డిక్కీలో కుక్కి

ఓ మహిళను దారుణంగా హతమార్చి.. కారు డిక్కీలో కుక్కి కాలువలో పడేసేందుకు వెళ్తుండగా.. పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. రూరల్ ప్రాంతానికి చెందిన కమలను(50).. కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో గల డీమార్ట్ షాపింగ్‌మాల్ వెనుక హతమార్చినట్టు సమాచారం. ఆ తర్వాత మహిళా మృతదేహాన్ని నగర శివారు లోని దాస్‌నగర్ వద్ద ఉన్న కాలువలో పడేసేందుకు కారు డిక్కీలో వేసుకొని వెళ్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు వాహన తనిఖీ చేపట్టగా.. దీంతో కారు ఆపకుండా తప్పించుకొని వెళ్ళారు. అనంతరం ఆ మతదేహాన్ని కాలువలో పడేసే క్రమంలో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఘటన స్థలానికి సౌత్ రూరల్ సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ ఆరిఫ్ చేరుకొని విచారణ చేపట్టారు. హత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. లైంగికదాడి చేసిహత్య చేశారా ఇంకేదైనా కారణమా అనే వివిధ కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వస్పత్రికి తరలించారు. కాగా విచారణ పూర్తయిన అనంతరం వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెబుతున్నారు.



రక్తపు మడుగులో మహిళ

కాగా పాంగ్ర శివారులో ఓ మహిళ దారుణ హత్యకు గురైయ్యారు. ఇంట్లోనే రక్తపుమడుగులో వివాహిత హత్యకు గురై ఉంది. 4వ టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ పోలీసుల వివరాల ప్రకారం.. చారుగొండ చంద్రకళ(55) కల్లుబట్టీ సమీపంలోని ఇంట్లో ఒంటరిగా నివసిస్తుంది. ఇద్దరు కూతుర్లకు వివాహలు జరిగాయి. కాగా ఈ నెల 23వ తేదీన మాట్లాడగా.. తర్వాత నుంచి కూతుర్లు ఫోన్ చేసినా ఫోన్ కలవలేదు. రెండు మూడు రోజులుగా చేసి చూసినా స్పందన రాలేదు. దీంతో అనుమానం రావడంతో శుక్రవారం గాంధారిలో ఉండే కూతురు మౌనిక తన భర్త వినయ్‌కుమార్‌తో కలిసి ఇంటికి రాగా దుర్గంధం వ్యాపించింది. లోపలికి వెళ్లి చూడగా.. తల్లి హత్యకు గురై ఉంది. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లిని ఎవరో హత్య చేసి చెవి కమ్మలు, మాటీలను ఎత్తుకెళ్లారని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-సిరికొండ

మండలంలో తుంపల్లి సొసైటీ పరిధిలో వరి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాములు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బకారం రవి, బాలరాజు నాయక్, వైస్ చైర్మన్ అబ్బాస్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాజేశ్వర్గౌడ్, డైరెక్టర్లు లక్ష్మణ్, నల్ల సావిత్రి, ప్రవీణ్, కోమల్, సొసైటీ కార్యదర్శి దేవీలాల్, రైతులు పాల్గొన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రంలో అన్ని రకాల వసతులు కల్పిస్తామని చైర్మన్ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బాడ్సి గ్రామంలో మండల అభివృద్ధికి అధికారి రాములు నాయక్, మండల పంచాయతీ అధికారి కిరణ్ కుమార్ గారి చేతుల మీదుగా గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటుచేసిన చలివెంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రాములు నాయక్ మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటు చెయ్యడం అభినందనీయమన్నారు.. వేసవి కాలం దాహం తీర్చడానికి ప్రతి ఒక్కరికి ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, శశాంక్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి హైస్కూల్లో రంజాన్ వేడుక



ఇఫ్తార్ విందులో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-నందిపేట్

మండల కేంద్రంలో కృష్ణవేణి పాఠశాలలో రంజాన్ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. పండ్లతో విద్యార్థులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రామాగౌడ్, మాధురి, ప్రిన్సిపల్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మైల్ పాఠశాలలో హెల్త్ క్యాంపు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ మల్టీ స్పెషాలిటీ ఆశాహస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం స్మైల్ స్కూల్లో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె.క్రాంతి కుమార్, పెడటిక్ డెంటిస్టు డాక్టర్ బిందు ఫెడటిక్ డెంటిస్ట్ పాల్గొని చిన్నారులకు హెల్త్ చెకప్ నిర్వహించారు. హిమోగ్లోబిన్ బ్లడ్ టెస్ట్ చేయించి వారికి రిపోర్టులు అందజేశారు. కావలసిన వాళ్లకు మెడిసిన్స్ అందజేశారు. వారికి స్మైల్ స్కూల్ యజమాన్యం తరఫున డైరెక్టర్ చంద్రశేఖర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ స్టాఫ్ సింధూర ప్రసన్న ఆశ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి కనీస వేతనం అమలు చేయాలి

- బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్



ధర్నా నిర్వహిస్తున్న బిఎల్‌టియు నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో దండి వెంకట్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్లు మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం కుల వివక్షతతో కూడిన శ్రమ దోపిడి చేస్తున్నాయని విమర్శించారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నాలుగు రోజులుగా బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ బి ఎల్ టియు ఆధ్వర్యంలో ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌ల ద్వారా పనులు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. పాత మున్సిపల్ కార్పొరేషన్ నుండి ప్రదర్శనగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకొని కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆలోపు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ల ద్వారా పనులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ ను కలిసి టెండర్ల ప్రక్రియ ద్వారా కార్మికులకు నష్టం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. అనంతరం దండి వెంకట్ మాట్లాడుతూ..హైదరాబాద్ కు చెందిన కాంట్రాక్టర్లకు పనులు ఇవ్వడం ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. ఒకవేళ హైదరాబాద్ కాంట్రాక్టర్లకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు టెండర్లు కట్టబెట్టినా యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏవిధంగానైతే సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ల ద్వారా పనులు నిర్వహిస్తున్నరో అదే విధానాన్ని నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అమలు చేయాలని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, బిఎల్ టీయూ నగర కమిటి అధ్యక్ష కార్యదర్శులు అనిల్, గంగా శంకర్, వాటర్ సెక్షన్ అధ్యక్షులు కొమ్ము రాహుల్, యూనియన్ సీనియర్ నాయకులు ఆర్. మురళి,నాయకులు రత్నన్, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నవీన్ ఎం, ఎల్లయ్య మోహన్ గౌడ్, సాయిలు, లక్ష్మణ్, సంతోష్ గౌడ్, ఏక్ నాథ్ లతోపాటు వాటర్ సెక్షన్, డ్రైవర్స్, శానిటేషన్ జవాన్లు, కార్మికులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేయొద్దంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు



నవతెలంగాణ-ఆర్మూర్

మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డిని అరెస్టు చేయొద్దని శుక్రవారం సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినట్టు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. భూమి విషయంలో సుప్రీంకోర్టులో జీవన్ రెడ్డి తరపున సీనియర్ న్యాయవాదులు ముఖుల్ రోహిత్గి, నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించినట్టు తెలిపారు.

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- సొసైటీ ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ఏకగ్రీవ తీరానం



డిచ్‌పల్లి: మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్

నవతెలంగాణ-విలేకరుల బృంధం

డిచ్‌పల్లి: సహకార సంఘాలకు చెల్లించవలసిన పాత బకాయిలు అసలు చెల్లించి వన్ టైం సెటిల్మెంట్ చేసుకోవాలని, డిచ్‌పల్లి మండల పరిధిలోని పలు సొసైటి పరిధిలోని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ సంఘాలకు కేటాయించాలని, రైతులు మాత్రం సొసైటి ద్వారానే వరి ధాన్యం కొనుగోలు చేసే విధంగా చూడాలని కోరుతూ మహాజన సభలో రైతులు ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. శుక్రవారం మండలంలోని రాంపూర్-డి, ఖిల్లా డిచ్‌పల్లి, బర్దీపూర్ సొసైటిల్లో జరిగిన మహాజన సభలో చైర్మన్లు తారచంద్ నాయక్, రామచందర్ గౌడ్, కొసరాజు రామకృష్ణ మాట్లాడుతూ.. పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలుకు ఐకేపీ సంఘాలకు కేటాయించారని అలా కాకుండా గతంలో సహకార సొసైటీల ద్వారానే కొనుగోలు ప్రక్రియ కొనసాగించే విధంగా చూడాలని రైతుల డిమాండ్ చేసినట్లు చైర్మన్లు తెలిపారు. సొసైటి పరిధిలో రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ కానీ అర్హులైన వారందరికి మాఫీ వర్తింప చేయాలన్నారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టె రైతులు జాగ్రత్తలు పాటించాలని, ఇందుకు గాను గ్రామస్తుల సహకారం తీసుకోవాలని రైతులకు సూచించారు. సంఘ ఆర్థిక లావాదేవీలు జమ, ఖర్చులు, అడిట్ రిపోర్ట్ ను పరిశీలించి ఆమోదం తెలిపారు. సన్న వడ్లు పండించిన రైతులు మధ్య దళారులకు అమ్మి మోసపోవద్దని సహకార సొసైటీల్లోనే విక్రయించుకుని ప్రభుత్వం అందజేస్తున్న 500 బోనస్ అదనంగా పొందాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించవలసిన హమాలీల ఖర్చులను రైతులకు చెల్లించాలని, వరి ధాన్యం కొనుగోలు సాఫీగా జరగడానికి జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యేవరకు మొరం టిప్పర్లు నడపకుండా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ కు విన్నవించనున్నట్లు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పోడెండ్ల స్వామి ,కుమ్మరి చిన్న గంగారం, డైరెక్టర్లు రాజ్ కుమార్, శేర్ పాపనోల్ల గంగారం, కుమ్మరి నర్సయ్య,బొక్క గంగాధర్, నాగేశ్వర్ రావు, అమర్ నాథ్,బెల్లాజీ రాజిరెడ్డి, అలపర్తి జయరామరాజు, మొట్టు గోపాల్, నర్సింలు, రమేష్, హరిచంద్, గంగారెడ్డి, సంతోష్, శ్యాంసన్, సీఈవో నాగరాజ్ ,కిషన్, పోలనారాయణరెడ్డి, నాగేశ్వరరావు, బాస ప్రభు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నాగేపూర్ మహాజన సభలో తీర్మానం

నవీపేట్: రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ రాష్ట్ర ప్రభుత్వం చేయాలని నాగేపూర్ పిఎసిఎస్ చైర్మన్ శైలేష్ కుమార్ అన్నారు. నాగేపూర్ సొసైటీ ఆవరణలో 63 వ మహాజన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలో 846 మంది సభ్యులకు గాను 4 కోట్ల పది లక్షల వరకు రుణమాఫీ జరిగిందని మరొక 310 మందికి రెండు కోట్ల 88 లక్షల వరకు రుణమాఫీ కావలసి ఉందని అన్నారు. క్రాఫ్ లోన్లు సైతం రైతులందరూ ఏడాదిలోపు రెన్యువల్ చేసుకోవాలని దీనివల్ల కేంద్ర ప్రభుత్వ మూడు శాతం రాయితీ పొందవచ్చని అన్నారు. సొసైటీ పరిధిలో కొత్తగా రుణాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నామని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బంది కలగకుండా రైతు స్వామి దాస్ కోరగా ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. సొసైటీ కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మాణానికి నైట్ వాచ్ మెన్ నియమించేందుకు తీర్మానించారు. గోదాంకు మరమ్మత్తులు మరియు 10 ఎకరాల లోపు రైతులకు రైతు భరోసా ఇవ్వాలని తీర్మానించారు. సెప్టెంబర్ 1 2024 నుండి 28 ఫిబ్రవరి 2025 వరకు జమ ఖర్చులను సీఈవో రమేష్ మహాజన సభ ముందు సమర్పించగా పాలకవర్గం ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ సత్యం రెడ్డి, డైరెక్టర్లు సాయిలు, శ్రీనివాసరావు, ధర్మాజీ, సాయన్న రైతులు పాల్గొన్నారు.

బోర్గాం (పి) సొసైటీలో మహాజనసభ

మోపాల్: మోపాల్ మండలంలోని బోర్గాం (పి) సొసైటీలో శుక్రవారం రోజున ఎన్డిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్ మరియు బోర్గం సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆర్థిక లావాదేవీలను సీఈఓ కష్ణ వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. అతి త్వరలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇస్తుందని అన్నారు. రైతులను లక్షాధికారులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భూంరెడ్డి, మాజీ విండో చైర్మన్ సూర్య రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ జయకృష్ణ, డైరెక్టర్లు మహేందర్ రెడ్డి, భుజేందర్ రెడ్డి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

రెంజర్ల సొసైటీలో 'మహాజన సభ

ముప్కాల్: రెంజర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం సొసైటీ అధ్యక్షులు కోమటిశెట్టి గంగాధర్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈమహాజన సభలో స్థానిక సొసైటీ సెక్రటరీ కె.గంగాధర్, సంఘ ఆర్థిక లావాదేవీలు, జమాఖర్చులను చదివి వినిపించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు ముస్కు సంతోష్ రెడ్డి, డైరెక్టర్లు ఆకుల రమేష్, కోమటిశెట్టి చింటు, క్యాతం గంగారెడ్డి, బుయ్య రాజన్న, దాసరి నర్సయ్య, బద్ది ప్రసాద్, సొసైటీ సెక్రటరీ కె.గంగాధర్, సొసైటీ సిబ్బంది, క్లస్టర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.



మోపాల్‌లో..



ముప్కాల్‌లో..



నవీపేట్: మాట్లాడుతున్న పిఎసిఎస్ చైర్మన్

125 సెల్‌ఫోన్లు రికవరి

- బాధితులకు అందజేసిన సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ మధ్య కాలంలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో సెల్ ఫోన్లు పోయినవారివి దాదాపు 125 రికవరి చేసినట్టు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య శుక్రవారం తెలిపారు. ఈ మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు సెల్ ఫోన్లను వాడడంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల పట్లకూడా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎవ్వరైనా వారి సెల్ ఫోన్ పోయినట్లయితే వారు www.ceir.gov.in వెబ్సైటులో వెళ్లి అందులో పూర్తి వివరాలు పొందపర్చాలని, అలా చేసినట్లయితే త్వరగా వారి సెల్ ఫోన్స్ ను పట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. కావున ప్రజలు ఈ పద్దతిని సద్వినియోగపర్చుకోవాలని తెలియజేశారు. సిఈఐఆర్ పోర్టల్ ద్వారా నెంబర్‌ను ఈ విధంగా రికవరి చేసిన సెల్‌ఫోన్స్‌ను పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్లో నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి. సాయిచైతన్య ఆధ్వర్యంలో 125 మందికి అందజేశారు. సెల్ ఫోన్ రికవరీలో కృషిచేసిన పోలీసులను అభినందించారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వా రెడ్డి, ఐటీ కోర్ ఆర్ఎస్ఐ నిషిత్, కో -ఆర్డి నేటర్ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది కుటుంబానికి చెక్కు పంపిణీ

సోలోమన్ ఆర్ఎస్ఐ వృత్తిరిత్యా ఏఆర్ పోలీస్ హెడ్ క్వార్టర్‌లో అనారోగ్యంతో మృతి చెందగా భద్రత ఎక్స్‌గ్రేషియా రూపంలో గల రూ.16లక్షల చెక్కును శుక్రవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సొలోమన్ కుమారుడికి అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డిసిపి జి. బస్వారెడ్డి, ఎ.ఓ అనిసాబేగం, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు తిరుపతి (అడ్మిన్ /ఎంటిఓ), శ్రీనివాస్ (వెల్ఫేర్), సతీష్ (హోమ్ గార్డ్స్), పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంటు షకిల్ పాషా, డిపిఓ సీనియర్ అసిస్టెంటు పి. రాజేశ్వర్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- బీజేపీ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి




వినతి అందజేస్తున్న బిజేపీ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్‌లో అక్రమాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బిజెపి పట్టణ అధ్యక్షులు మందుల బాలు ఆరోపించారు. బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ పండుగ సందర్భంగా 10 లక్షల రూపాయల మొరంతో రోడ్ల మరమ్మతులు అని అక్రమాలు, తైబజార్ పాత బకాయిలు రికవరీపై వివరణ కోరారు. రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలో రోడ్ల మరమ్మత్తుల కోసం 10 లక్షల రూపాయల మొరం వేస్తున్నామని చెప్పి ప్రైవేట్ స్థలాల్లో ప్రవేట్ వెంచర్‌లో మొరం తరలిస్తూ అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. గడిచిన వర్షాకాలంలో అనేక కాలనీల్లో రోడ్లు ప్రజలు నడవలేని స్థితిలో ఉన్నాయని ప్రజలు ఎన్నో వినితులు ఇచ్చి మొరం వేసి మరమ్మత్తులు చేయాలని కోరినప్పటికీ చేయని మున్సిపల్ అధికారులు ఇప్పుడు రంజాన్ పండుగ సందర్భంగా 10 లక్షల రూపాయలతో మొరం అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. పాత తైబజార్ బకాయిలు ఇంకా వసూలు చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. పాత బకాయిలు వసూలు చేసే వరకు తైబజార్ వేలం పాటను ఆపాలని కోరారు. బకాయి పడ్డ నాయకుల నుండి తక్షణమే వసూలు చేయాలని లేని పక్షంలో వారి ఆస్తులు జప్తు చేసైనా రికవరీ చేయాలని కోరారు. తైబజార్ కాంట్రాక్టర్లు సిండికేట్ గా మారి మున్సిపల్ ఆదాయాన్ని గండి కొట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అనుకున్న ఆదాయం రాకపోతే వేలం పాటను ఆపాలని కోరారు. పేద ప్రజలు టాక్స్ కట్టకపోతే వారిని బిల్ కలెక్టర్లు ఏ విధంగా ఒత్తిడికి గురి చేసి రికవరీ చేస్తున్నారో గమనించాలని కోరారు. పేద ప్రజల నుండి ట్యాక్సు వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధ తైబజార్ లాంటి పెద్ద మొత్తం బకాయిలను రికవరీ చేయడంలో ముందుండాలని కోరారు. కార్యక్రమంలో పాన్ శీను, దొండి ప్రకాష్, గుగులోత్ తిరుపతి నాయక్, కందేశ్ ప్రశాంత్, బండ్లపల్లి నర్సారెడ్డి, ప్రసన్న గౌడ్, కొడియాల సుధాకర్, బాసెట్టి రాజ్ కుమార్, కుమార్, గోపి, నవీన్, సతీష్, నూనె శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

అమెరికాలో సివిల్ ఇంజనీర్‌గా ప్రశంసలు పొందుతున్న ఇందూరువాసి

- హర్షం వ్యక్తం చేస్తున్న మిత్రులు



నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్‌లో రావూజీ సంఘం పాఠశాలలో చదువుకొని 25 సంవత్సరాల కిందట అమెరికా వెళ్లి అక్కడ స్థిరపడి సివిల్ ఇంజనీరుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన ఇందూరు వాసి అందరి ప్రశంసలు పొందుతున్నారని సేహితులు కరుణాకర్‌గౌడ్, సత్యనారాణ, హరీష్, కృష్ణ, పటేవార్ శ్రీనివాస్, రావూజీసంఘం పాఠశాల మిత్రులు శుక్రవారం తెలిపారు. ఇందూర్ పట్టణానికి చెందిన అంకం పరమేశ్వర్ అమెరికా వెస్ట్ రీజినల్‌లోని ఉత్తమ ఎంప్లాయ్‌గా సంస్థలో గుర్తింపుపొందారని పేర్కొన్నారు. నీతినిజాయితీతో పని చేస్తూ ఇతరులకు సహాయపడడంలో ముందు ఉండడంలోనే కాకుండా, ఇంజనీరింగ్ నిష్ణాతుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ఏఈసీఓఎం అంటే బలమైన రోడ్‌వే మోడల్‌లో ఒకటని, ఏఈసీఓఎం వద్ద యుఎస్ వెస్ట్ రీజియన్ సీఈవో చీఫ్ ఎగ్జిక్యూటివ్ పరమేశ్వర్‌ని కలవాలనుకుకోవడం ఎంతో హర్షణీయమని తెలిపారు.

ఆర్‌కే కంప్యూటర్స్‌లో పలు కోర్సుల్లో 50 శాతం తగ్గింపు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల ఆర్‌కె కంప్యూటర్స్ 20 సంవత్స రాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులకు పలు కోర్సులలో 50శాతం తగ్గింపుతో శిక్షణ ఇస్తున్నట్టు మేనేజ్మెంట్ సరస్వతి శుక్రవారం తెలిపారు. ప్రతి సంవత్సరం 50మంది పేద విద్యార్థులకు ఉచితంగా పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. పట్టణ, చుట్టుపక్కల గ్రా మాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు వారం సంత వేలం

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో ప్రతి వారం జరిగే సంత ను 2025-2026 సంవత్సరానికి గాను శనివారం వేలం నిర్వహించనున్నట్టు గ్రామపంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి తెలిపారు. వార సంత వేలంను ఇప్పటి వరకు మూడుసార్లు వేలం నిర్వహించడం జరిగిందని, కనీస ధర రానందున శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు చెప్పారు.

5 వరకు రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తు చేసుకోవాలి


- జిల్లా అల్పసంఖ్యాక సంక్షేమ శాఖాధికారి

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాజీవ్ యువ వికాసం పథకము నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఒక ప్రతిష్టాత్మకమైన రాజీవ్ యువ వికాసం పథకంను నూతనంగా ప్రారంభించింది. ఈ పథకం కింద అన్ని కార్పొరేషన్‌లకు సంబంధించిన ఉమ్మడి మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిందని జిల్లా అల్ప సంఖ్యాక సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం నుండి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్, క్రైస్తవ మైనారిటీ కమ్యూనిటీకి చందిన యుత స్వయం ఉపాధి వ్యాపారాలను ప్రారంభించడంలో సాధికారత కల్పించడానికి రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు. స్వయం ఉపాధి వ్యాపారాలను ప్రారంభించడానికి అర్హులైన క్రైస్తవులకు ఈ క్రింద తెలిపిన విధంగా సబ్సిడీ, బ్యాంక్ లోన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలను ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్/ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం, పట్టాదారు పాసుబుక్ (నీటిపారుదల సంభందిత పథకాలకు), సదరెం సర్టిఫికేట్ (వికలాంగులకు), రవాణా సంబంధిత పథకాలను (డ్రైవింగ్ లైసెన్స్) తో పాటు దరఖాస్తు చేసుకోవచ్చుని, దరఖాస్తు చివరి తేదీ ఏప్రిల్ 5 వరకు ఉందని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి http://tgobmmsnew.cgg.gov.in/ Commo nregistration.action లింక్ ను క్లిక్ చేయాలని పేర్కొన్నారు.

ఏటీఎం దొంగల అరెస్టు

- 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఏటిఎంలో దొంగతనానికి ప్రయత్నించిన ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి, 4 ద్విచక్ర వాహనాలు, 12వేల రూపాయలను స్వాదీనం చేసుకున్నట్లు డిచ్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే.మల్లేష్, ఎస్‌హెచ్‌ఓ మోహమ్మద్ షరీఫ్ తెలిపారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గురువారం తెల్లవారు జామున నడిపల్లి ఎస్‌బిఐ ఏటిఎంలో దొంగతనానికి వెళ్లి ఏటిఎంను పగులగొట్టే క్రమంలో అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా దొంగలు బ్యాంకు గోడ దూకి పారిపోయారు. వెంటనే ఈ విషయాన్ని డిచ్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే మల్లేష్, ఎస్‌హెచ్‌ఓకు తెలుపగా ఘటన స్థలానికి చేరుకుని నాలుగు పోలీస్ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. డిచ్‌పల్లిలోని అన్ని రూట్‌లలో వాహనాల తనిఖీలు చేస్తుండగా కొద్ది గంటల్లోనే ఏటిఎం దొంగతనానికి ప్రయత్నించిన ఎ-1 రుద్రబోయిన గణేష్, ఏ-2 నిమ్మ బోయిన సురేష్‌ను పట్టుకుని విచారించినట్లు సీఐ, ఎస్‌హెచ్‌వో తెలిపారు. వీరు గతంలో బైకులు, పలు ఇళ్లలో, ఆలయాల్లో హుండీలను దొంగతనాలు చేసిన కేసులలో పోలీసులు వీరిని జైలుకు పంపించారని పేర్కొన్నారు. వీరి వద్ద నుండి నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ. 12వేలు నగదును స్వాధీనం చేసుకుని, ఎనిమిది కేసులకు సంబంధించి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

100 రోజుల పని పూర్తి

• ఉపాధి కూలీకి తోటి కూలీల సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి గ్రామానికి చెందిన రఘుపతి శాంత అనే ఉపాధి కూలీ శుక్రవారంతో తన 100 రోజుల పని పూర్తి చేసిన నేపథ్యంలో ఆమెను తోటి కూలీలు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ అనిత మాట్లాడుతూ.. జాబుకార్డులో ఆమె ఒక్కరే కూలీ పని చేసినట్లు తెలిపారు.


ఉపాధి కూలీని సన్మానిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

పంచాయతీ కార్యదర్శుల మండల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-రాజంపేట్

పంచాయతీ కార్యదర్శుల మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా రామకృష్ణ, ఉపాధ్యక్షురాలుగా స్వాతి, జనరల్ సెక్రెటరీగా వంశీకృష్ణ, కోశాధికారిగా వసంతను ఎన్నుకున్నారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.


ఎన్నికైన నూతన కార్యవర్గం

పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి


బిచ్కుంద: మాట్లాడుతున్న చైర్మన్


గాంధారిలో..


తాడ్వాయిలో..

• మహాజన సభల్లో రైతుల తీర్మానాలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

రైతు సేవా సహకార సంఘం 58వ మహాజన సభ..

బిచ్కుంద : మండల కేంద్రంలోని రైతు సేవ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో చైర్మన్ నాల్చర్ బాలాజీ అధ్యక్షతన 58వ మహాజన సభ నిర్వహించారు. ముందుగా సీఈఓ శ్రావణ్ సంఘం లావాదేవీలను సభలో చదివి వినిపించి ఆమోదించారు. సంఘం రైస్‌మిల్ స్థలంలో నూతన ఫంక్షన్ హాల్ నిర్మాణం చేయుటకు సంఘంలో గల రైతుల రుణాలు ఏకకాలంలో 2లక్షల లోపు రుణమాఫీ చేయాలని తీర్మానించారు. రైతుల గడువు మీరిన రుణాలను రెన్యువల్ చేయించి రెన్యువల్ శాతం పెంచాలని, ప్రభుత్వం జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని, ఎకరానికి 25 క్వింటాలు వరకు జొన్న పంట కొనుగోలు చేయాలని రైతుల సమక్షంలో తీర్మానం చేశారు. మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతికుమార్, వైస్ చైర్మన్ యాదవ్‌రావ్, సంఘం డైరెక్టర్లు ధర్పల్ సంజు, పోతుల అశోక్, సాయిని శంకర్, శంకర్ నాయక్, అనిశెట్టి శివరాజ్, చంద్రకాంత్ పటేల్, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంలోని గాంధారి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ, ఐడిసిఎంఎస్ డైరెక్టర్ పెద్దబూరి సాయికుమార్ అధ్యక్షతన సహకార సంఘం ఆవరణలో మహాజన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమములో చైర్మన్ సాయికుమార్ మాట్లాడుతూ.. రైతులు తీసుకున్న అప్పులు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. త్వరలోనే సంఘం పరిధిలో ఉన్న పెట్‌సంగెం గ్రామంలో గోదాం నిర్మాణ పనులు ప్రారంభం చేస్తామని అన్నారు. అనంతరం కార్యదర్శి గాండ్ల సాయిలు సొసైటీ వార్షిక లావాదేవీలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గాంధారి తాజా మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, సొసైటీ వైస్ చైర్మన్ ఉదల్ సింగ్, సొసైటీ డైరెక్టర్లు ధోల్లు సాయిలు, గాండ్ల లక్ష్మణ్, తాడ్వాయి సంతోష్ కుమార్, రొడ్డ అశోక్‌రెడ్డి, ఆర్ల శివాజీరావు, కోనింటి మణెవ్వ పోచయ్య, వజీర్, సవితాబాయి, ముకుంద్‌రావు, గొల్ల హర్షయ్య, పయ్యల జనార్ధన్ గౌడ్, గోవింద్, గణపతిరావు, రాథోడ్ నెహ్రూ, సంఘం పరిధిలోని వివిధ గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ చేయాలి..

తాడ్వాయి : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ నల్లవెల్లి కపిల్ రెడ్డి అధ్యక్షతన 65వ మహాజన సభను శుక్రవారం నిర్వహించారు. సహకార సంఘం పరిధిలో 1389 మంది రైతులు ఉండగా 631 మంది రైతులకు మాఫీ కాగా 758 మంది రైతులకు మాఫీ చేయాలని, రూ.2000తో నూతన సభ్యత్వం చేర్చుకునేందుకు తీర్మానం చేశారు. కొత్తగా 192 మంది రైతులకు పంట రుణాలుగా రూ.1,22,64,000 రూపాయల రుణాలు ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పీసు రాజిరెడ్డి, టి.మోహన్‌రెడ్డి, పి.సంజీవరెడ్డి, మంగారెడ్డి, ఆయా గ్రామాల రైతులు, సీఈవో నరసింహులు, సిబ్బంది బాలకిషన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శబరీమాత ఆలయానికి రూ.3.50 లక్షల విరాళం

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రయానికి రూ.3లక్షల 50 వేల రూపాయల విరాళాలు ఆలయ కమిటీకి శుక్రవారం అందజేసినట్లు తెలిపారు. మాతా స్వగ్రామమైన తొగిట, మెదక్ జిల్లా పరిసర ప్రాంతాల్లో భక్తులు ట్రస్ట్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విరాళంగా రూ.3,50,000 నగదు అందజేసినట్లు ట్రస్ట్ సభ్యుల తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదాం నరసింహులు, కాసెట్టి రామాంజనేయులు, మద్ది మహేందర్‌రెడ్డి, భక్తులు తదితరులున్నారు.

ప్రార్థనా సమయానికి హాజరవ్వాలి: ఎంఈవో


పాఠశాలను పరిశీలించిన మండల విద్యాధికారి శ్రీహరి

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి శ్రీహరి శుక్రవారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు పిల్లలందరూ తప్పకుండా పాఠశాలకు ప్రార్థనా సమయానికి హాజరవ్వాలని, వేసవి కాలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై ఎఫ్ఏ 4, ఎఫ్ఎల్ఎన్ అంత్య పరీక్షల ప్రగతిని విద్యార్థుల వారిగా ఆన్లైన్లో నమోదు చేయాలని, అలాగే పాఠశాలకు వచ్చిన నిధులను స్టాఫ్ మీటింగ్ నిర్వహించి ప్రతి ఉపాధ్యాయులతో చర్చించి నార్మ్స్ ప్రకారం తీర్మానాలను రిజిస్టర్లు రాస్తూ పాఠశాలకు నిధులు ఖర్చు చేయాలని సూచించారు. ప్రార్థన నిర్వహించే విధానంపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ప్రార్థన సమయానికి ఉపాధ్యాయులు అందరూ ఉండాలని అన్నారు.

బావిలో దూకి వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-గాంధారి

బావిలో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని చిన్నపోతంగల్ గ్రామంలో చోటుచేసుకుంది. గాంధారి ఎస్సై ఆంజనేయులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుప్పాల భాగ్యలక్ష్మి (45) అనే వివాహిత గత కొంతకాలంగా టీబీతో బాధపడుతోంది. దగ్గు, దమ్ము విపరీతంగా రావడంతో పాటు పిల్లలు కూడా లేవకపోవడంతో మనస్థాపానికి గురై గురువారం రాత్రి భర్త పడుకున్న తర్వాత ఇంటి బయట గొల్లెం పెట్టి గ్రామ శివారులో గల కిషన్‌రావు బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.


మృతదేహం వద్ద విలపిస్తున్న దృశ్యం

డోంగ్లిలో పశువైద్య శిబిరం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే పశువైద్య శిబిరాలను పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య రమేష్ వైస్ చైర్మెన్ పరమేష్ పటేల్ తెలిపారు. జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు ఆదేశాల మేరకు మద్నూర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని ఉచిత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు. డోంగ్లీ మండలంలోని డోంగ్లీ గ్రామంలో ఏఎంసీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని చైర్మన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య డాక్టర్‌లు డైరెక్టర్ హన్మంత్ పటేల్, శివాజీ పటేల్, దీన్‌దయాల్, ఆనంద్ పటేల్, మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ పి.రమేష్, మార్కెట్ కమిటీ సూపర్వైజర్లు చందర్, సత్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

కందకాలతో భూగర్భజలాలు వృద్ధి

నవతెలంగాణ-జుక్కల్

కందకాలు తీయడం వలన భూగర్భ జలాలు పెరుగుతాయని జుక్కల్ ఎంపిడిఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేంరాజ్‌కల్లాలీ గ్రామంలో అభివృద్ధి పనులను సందర్శించారు. అనంతరం ఉపాధి హామీలో చేపడుతున్న కందకాల తవ్వకాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామాలలో కందకాలు తవ్వాలని, వర్షపు నీరు నిల్వ ఉండేందుకు ఈ కందకాలు చాలా ఉపయోగపడతాయని, తద్వారా భూగర్భ జలాలకు ఢోకా ఉండదని అన్నారు. ఉపాధిహామీ పనులు పేదప్రజలకు ఆర్థికంగా ఆదుకునేందుకు మంచి పథకమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఈసీ స్వామి దాస్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

స్కావెంజర్లకు గౌరవ వేతనం ఇవ్వండి

• డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవుల

నవతెలంగాణ-సదాశివనగర్

స్కావెంజర్ల గౌరవ వేతనం ఇవ్వాలని డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవుల డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో డిటిఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సందర్భంగా డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవుల మాట్లాడుతూ.. స్కావెంజర్ల గౌరవ వేతనం ఇవ్వాలని ఆయన అన్నారు. స్కావెంజర్ లేకుంటే పాఠశాలలో కంపు కొడుతాయని తెలిపారు. స్కావెంజర్లు వచ్చిన నుంచి పాఠశాలలు శుభ్రంగా ఉంటుందని అన్నారు. వారు పాఠశాలలోని మైదానం, గదులను, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుతారని గుర్తుచేశారు. స్కావెంజర్ లేకుంటే ఉపాధ్యాయులే అన్ని పనులు చేసుకోవాల్సి వస్తుందని అన్నారు. స్కావెంజర్‌గా పనిచేసేవారు పేదవారే ఉంటున్నారని వివరించారు. వారికి నిత్యావసర సరుకులు కొనుక్కోలేక నానా ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వారికి గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ ప్రతినిధి గంగారాం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిటిఎఫ్ నాయకులు

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

• ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎల్లారెడ్డి సిఐ రవీందర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల పోలీస్ స్టేషన్లో హిందూ ముస్లింలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండగలు శాంతియుతగా జరుపుకోవాలని అన్నారు. ఈనెల 30న ఉగాది, 31న రంజాన్ పండుగలు ఒకదాని తర్వాత ఒకటి రావడంతో పండగలు అందరూ కలిసిమెలిసి స్నేహభావంతో జరుపుకోవాలని సూచించారు. ఉగాది రోజు నల్లపోచమ్మ ఆలయం వద్ద నిర్వహించే ఎడ్లబండ్ల ప్రదర్శన వివరాలను అన్ని గ్రామస్తులవారు పోలీస్ స్టేషన్లో నమోదు చేసుకోవాలని ఆయన అన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని వ్యక్తిగతంగా ఎవరు సమస్యలలో తల దూర్చొద్దని ఆయన అన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసరావు పోలీస్ సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న సీఐ రవీందర్ నాయక్

మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువైద్యశిబిరం


పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-కామారెడ్డి

మండలంలోని ఇస్రోజీవాడి గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కామారెడ్డి ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో గల పశువులకు వైద్యులు రవికిరణ్, అనిల్‌రెడ్డి, గోపాలమిత్రలు కలిసి చికిత్స నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ పశు వైద్య శిబిరంలో గ్రామస్తులు వారి పశువులకు చికిత్స జరిపించుకొని వ్యవసాయ మార్కెట్ కమిటీ కామారెడ్డి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ధర్మగోని లక్ష్మీరాజాగౌడ్, వైస్‌చైర్మన్ మినుకూరి బ్రహ్మానందరెడ్డి, డైరెక్టర్లు సుదర్శన్ రావు, వలిప్శెట్టి లక్ష్మీరాజామ్, దోమకొండ శ్రీనివాస్, మక్బుల్, రాజలింగం, గ్రేడ్ 3 సెక్రటరీ దర్శింగ్, మార్కెట్ కమిటీ సిబ్బంది పశు వైద్యాధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహించిన ఏ ఒక్క సారికూడా ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఎందరో ఎమ్మెల్యేలు గెలుపొందిన మంత్రి పదవికి నోచుకోని వెనుకబడ్డ ప్రాంత జుక్కల్ నియోజకవర్గానికి ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్న విద్యావంతుడు తోటా లక్ష్మి కాంతారావుకు మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం మద్నూర్, డోంగ్లి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావుకు మంత్రి పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మండలాధ్యక్షులు ధరాస్ సాయిలు, మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రామ్‌పటేల్, మాజీ ఎంపీపీ ప్రజ్ఞకుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమాన్లు, స్వామి, విట్టల్ గురూజీ, కొండ గంగాధర్, వట్నాల రమేష్, ఆలయ కమిటీ సభ్యులు కైలాసెట్ నాయకులు పాల్గొన్నారు.

సహకార సంఘం చైర్‌పర్సన్‌ను సస్పెండ్ చేయాలి


నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

నవతెలంగాణ-పోతంగల్ (కోటగిరి)

కోటగిరి మండల కేంద్రంలో రైతుల బోనస్ డబ్బులు కాజేసిన సహకార సంఘం చైర్‌పర్సన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని సీపీఐ నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి ఎ.విఠల్‌గౌడ్, జిల్లా రైతు నాయకులు నల్లగంగాధర్ మాట్లాడుతూ.. సొసైటీ ధాన్యం విక్రయించని రైతుల పేర్లతో బోనస్ కాజేసిన చైర్‌పర్సన్‌ను తక్షణమే విజిలెన్స్‌తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు బుట్ట గంగాధర్, సాయిలు, రాములు, లక్ష్మణ్, శంకర్, చిత్తారి శీను, సీపీఐ నాయకులు నల్లగంగాధర్, రాములు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ప్రతిరోజు వ్యాయామం తప్పనిసరి


వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరఫీ చికిత్సలు

నవతెలంగాణ-నిజాంసాగర్

వికలాంగ విద్యార్థులకు క్రమం తప్పకుండా వ్యాయామం నిర్వహించాలని ఫిజియోథెరపీ డాక్టర్ అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యానభస్తున్న వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులు ఇంటి వద్దనే చిన్నచిన్న వ్యాయామ ఆసనాలను వేయిస్తే వారి అవయవ లోపం క్రమేపీ తగ్గుతుందని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టి గైని చిన్న సాయిలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు

• ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్


బందోబస్తులో పాల్గొన్న పోలీసులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద శుక్రవారం బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎల్లారెడ్డి సిఐ రవీందర్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి భౌతికశాస్త్రం పరీక్షల నేపథ్యంలో ఏర్పాటు చేసిన బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అధికారుల ఆదేశానుసారం పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఆయన వెంట ఏఎస్ఐ ప్రకాష్, కానిస్టేబుల్ జైకుమార్, దివ్య, హమీద్ ఉన్నారు.

కేజీబీవీని సందర్శించిన ప్రధానోపాధ్యాయులు


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కాంప్లెక్స్ హెడ్మాస్టర్

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కాంప్లెక్స్ హెడ్మాస్టర్ శోభారాణి, సీఆర్పీ సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలోని అన్ని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అటెండెన్స్, రిజిస్టర్, యుడైస్ ప్లేస్‌లో ఉన్న విద్యార్థుల సంఖ్య వెరిఫికేషన్ చేశారు. వంట వస్తువుల స్టాక్ రిజిస్టర్, వస్తువుల నాణ్యతను పరిశీలించారు. భోజన వసతిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా తల్లిదండ్రులు మీటింగ్ నిర్వహణ, ఎజెండా అంశాలు హాజరును పరిశీలించారు. ప్రతి రోజు లైబ్రరీలో బుక్స్ చదవాలని, బాలికలు అన్ని రంగాలలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. వంట పాత్రలు శుభ్రత, వంట చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎల్ఈపి కార్యక్రమంలో భాగంగా అనంతరం 9వ తరగతి హిందీ క్లాస్ రూమ్ టీచింగ్ అబ్జర్వేషన్ చేశారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రతేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాసంతి, ఉపాధ్యాయులు హేమలత, మీనా, మౌనిక సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు ఉత్సాహంగా, ఉల్లాసంగా హెూరా హెూరీగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్ర వారం పురుషుల క్రికెట్ ఫైనల్ పోటీలను వర్సిటీ క్రీడా మైదానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని,టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో పదకొండు జట్లు పాల్గొనగా ఫైనల్ పిజి సీనియర్స్ మరియు పిజి జూనియర్స్ జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ డా. జీ.బాలకిషన్, వర్సిటీ పిఆర్‌ఓ డైరెక్టర్ డాక్టర్.పున్నయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.బి.ఆర్ నేత, జాదవ్ నరేష్(జూనియర్ అసిస్టెంట్),కబడ్డీ ఆఫిషియల్స్ తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారికి వినతి

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)



మండలంలోని పడగల గ్రామ సబ్ స్టేషన్ కమిటీ నెంబర్స్ ఎన్పీడీసీఎల్ డివిజనల్ ఇంజనీర్ పివి రాజేశ్వరరావు కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పడగల్ సబ్ స్టేషన్ పరిధి గ్రామాలలో లైన్ ఏబి స్విచ్లు, ఇంటర్ పోల్స్ , గద్దెల నిర్మాణం చేపట్టాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అంగోళ్ల రవీందర్ యాదవ్, దొడ్డికింది రాజేందర్, కొట్టాల శ్రీనివాస్, బొంకూర్ వేణు, సింగ్ చిన్న భోజన్న, గోలి సాగర్, యాళ్ల హనుమంతు, పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "రాజీవ్ యువ వికాసం" స్వయం ఉపాధి పథకాలకు నిజామాబాద్ జిల్లాలోని వెనుకబడిన వర్గాల బీ.సీ, ఈ.బీ.సీ, (ఈ.డబ్ల్యూ.ఎస్), ఫెడరేషన్ లకు చెందిన నిరుద్యోగ యువతీ/యువకులు ఆన్ లైన్ లో ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ పథకం ద్వారా గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు రుణం పొందవచ్చని అన్నారు. 50 వేల రూపాయల లోపు విలువ చేసే యూనిట్ కు 100 శాతం సబ్సిడీ వర్తిస్తుందని, లక్ష రూపాయల లోపు యూనిట్ కు 90 శాతం సబ్సిడీ, 2 లక్షల యూనిట్ కు 80 శాతం సబ్సిడీ, 4 లక్షల వరకు విలువ చేసే యూనిట్ కు 70 శాతం సబ్సిడీ వర్తిస్తుందని వివరించారు. అభ్యర్థులు వ్యవసాయేతర పథకాలకు సంబంధించిన యూనిట్ల స్థాపనకై 21-55 ఏళ్ళ వయస్సు, వ్యవసాయ ఆధారిత పథకాలకు 21-60 ఏళ్ళ వయసు కలిగి ఉండాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నట్లయితే కుటుంబ వార్షిక ఆదాయము రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షల లోపు ఉన్న వారు అర్హులని, బ్యాంక్ సమ్మతి తప్పనిసరిగా ఉండాలన్నారు. దరఖాస్తుకు ఆధార్ కార్డు, పాన్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, విద్యార్హతలు, బ్యాంక్ ఖాతా ప్రతులను తప్పనిసరిగా జత చేయవలెనని అన్నారు. ఆసక్తి గల వెనుకబడిన వర్గాల నిరుద్యోగ యువతీ, యువకులు https://tgobmmsnew.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్లో 2025 ఏప్రిల్ 5వ తేదీ లోపు ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్ లైన్లో అప్ లోడ్ చేసిన దరఖాస్తులను అర్జీదారు డౌన్ లోడ్ చేసుకొని, దరఖాస్తుకు ఆధార్ కార్డు, పాన్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, విద్యార్హతలు, బ్యాంక్ ఖాతా ప్రతులను జత చేసి సంబంధిత మండల ఎంపిడిఓ లకు, మున్సిపల్ కార్యాలయములో అందజేయాలన్నారు. ఇట్టి అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వెనుకబడిన వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

యువవికాసం పథకాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ముప్కాల్

రాజీవ్ యువ వికాసం కోసం మండలంలోని నిరుద్యోగ యువతి,యువకులు దరఖాస్తులు చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి నరేష్ ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీల నుంచి అర్హులైన నిరుద్యోగులు వచ్చే నెల 5వ తేదీ లోగా ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రూ.4లక్షల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. ఈ పథకానికి సంబంధించి నిరుద్యోగ యువతకు 60 నుంచి 80 శాతం వరకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని పేర్కొన్నారు. జూన్ 2న లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, మండలంలోని యువత ఇట్టి అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోర్ బోలి భాష బిల్లు ఆమోదం పట్ల హర్షం

- కేంద్రం బిల్లు ఆమోదించాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు
- జిల్లా బంజారా సదర్ నాయక్ రాజు నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి

తెలంగాణ శాసనసభలో గురువారం గిరిజన బంజారా గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చి బిల్లును ఆమోదం తెలిపి వారి భాషకు గుర్తింపు లభించే విధంగా కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,బోదన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి చిత్రపటానికి జిల్లా బంజారా సదర్ నాయక్ రాజు నాయక్, బంజారా మండల అధ్యక్షులు తూకరం, వర్కింగ్ అధ్యక్షులు మేతిలల్ అధ్వర్యంలో శుక్రవారం ఇందల్ వాయి ఆర్టీసీ బస్టాండ్ వద్ద పాలాభిషేకం నిర్వహించి మాట్లాడారు. బంజారాల భాష గోర్ బోలికి రాజ్యాంగంలో చేర్చి ప్రాముఖ్యత కల్పించాలని డిమాండ్ చేస్తున్న ఎవరు పట్టించుకోలేదని అన్నారు. అధికారంలోకి రాగానే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా కృషి చేసి గోర్ బోలీ భాషను రాజ్యాంగంలో 8వ షెడ్యూల్ లో చేర్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం కూడా ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంజారా నాయకులు గంగారం, అంబర్ సింగ్, బొంబాయి మోతిరాం, తదితరులు ఉన్నారు.

జక్రాన్‌పల్లి: ఈనెల 27న జరిగిన అసెంబ్లీ సమావేశంలో ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన 15 కోట్ల బంజారాలు మాట్లాడే గోర్ బోలి భాషను అధికార భాషగా గుర్తించి భారత రాజ్యాంగం 8 వ షెడ్యూల్ లో చేర్చాలని తీర్మానం చేయడాన్ని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పిఎస్) రాష్ట్ర కమిటీ తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రికి జిల్లా అధ్యక్షుడు మోహన్ నాయక్ చౌహన్, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 30 సంవత్సరాలుగా చేసిన ఉద్యమ ఫలితంగా నెరవేరిన డిమాండ్ అని పేర్కొన్నారు.

అత్యవసరమైతే తప్ప ఎండలోకి వెళ్లొద్దు

- వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువ
- డిప్యూటీ డిఎంహెచ్ఓ తూకరం రాథోడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎండలవల్ల వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువగా ఉంటుందని,అత్యవసరమైతే తప్ప ఎండలోకి వెళ్లొద్దని, ఎళ్ళవేళలా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని నిజామాబాద్ డిప్యూటీ డిఎంహెచ్ఓ, జిల్లా మలేరియా అధికారి తూకరం రాథోడ్ సూచించారు.శుక్రవారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాల లో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించి వంట చేయువారికి తగిన సూచనలు అందజేశారు. వంట పూర్తైన తర్వాత అయోడిన్ ఉప్పును కలపాలని ఆదేశించారు. అత్యవసరంగా ఎండలో వెళ్ళినట్లయితే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగాలని, శరీరం నుండి లవణాలు పూర్తిగా వెళ్లిపోయినట్లయితే వడదెబ్బ వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ఎండాకాలంలో ద్రవపదార్థాలు అధికంగా తీసుకోవాలని, చిటికెడు ఉప్పు, పిడికెడు పంచదార కలిపిన నీటిని తాగాలని అన్నారు. కార్యక్రమంలో ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సుశాంత్ రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య కార్యకర్త శారద, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాస్, ఆనంద్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్లు అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మొబైల్ ఫోన్ లను పోగొట్టుకున్న ఆరుగురికి సిఈఐఆర్ పోర్టల్ ద్వారా పట్టుకుని వారికి శుక్రవారం ఇందల్ వాయి పోలీస్ స్టేషన్‌లో అందజేసినట్లు ఎస్ హెచ్ ఓ మనోజ్ కుమార్ తెలిపారు. ఫోన్ల రికవరీ లో కృషి చేసిన ఉమెన్ కానిస్టేబుల్ ఎస్ కె సమ్రిన్ ను అభినందించారు

ఎండాకాలం.. పిల్లలు జాగ్రత్త

- డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం
- నిర్లక్ష్యం చేస్తే అనారోగ్యం తప్పదు
- ఆహారంలో జాగ్రత్తలు తప్పనిసరి
- చల్లటి పదార్థాలు హానికరం
- సిద్ధి వినాయక ఆసుపత్రి పిల్లలు, నవజాత శిశువుల నిపుణులు అజ్జ శ్రీనివాస్



నవతెలంగాణ-కంఠేశ్వర్

వేసవి కాలం వచ్చేసింది. దీంతో ఎండలు బాగా మండిపోతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దీంతో జనాలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతూ చుక్కలు చూపిస్తున్నాయి. దీంతో చాలా మందికి అప్పుడే డిహైడ్రేషన్ సమస్య మొదలైపోయింది. అయితే మండే ఎండలకు పెద్దలు పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. ఇక పసిపిల్లల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తల్లులు చిన్నారుల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోకపోతే వారు వేసవి మొత్తం పలు ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు ఆసుపత్రి పాలవుతారు. కాబట్టి ఎండాకాలం పోయేవరకు తల్లులు, పసి పిల్లల విషయంలో ఈ జాగ్రత్తలు తీసుకోవడం బిడ్డకు మంచిదని వైద్య నిపుణులు సలహాలిస్తున్నారు. వైద్యులు నీరు ఎక్కువగా తీసుకోవాలని చెబుతుంటారు. నీరు పెద్దలకే కాదు.. పిల్లలకు కూడా చాలా అవసరం. కాబట్టి తల్లులు పదే పదే నీరు లేదా పాలు పట్టిస్తూ ఉండాలి. లేదంటే డీహైడ్రేషన్‌కు గురై బిడ్డ ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఒక్కోసారి కదలకుండా అలాగే ఉండిపోతారు. తల్లులు వారి చుట్టుపక్కలే ఉంటూ గమనిస్తూ ఉండాలి. అయితే కొందరు వేడికి పిల్లలను ఏసీ గదుల్లో పడుకోబెడతారని, అలా చేయడం చాలా ప్రమాదకరమని నిపుణులు అంటున్నారు. ఎండాకాలం పోయేదాక పిల్లలకు వేడి చేసేవి తినకుండా ఆహారం తీసుకునే విషయంలోనూ తల్లులు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. లేదంటే పిల్లలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

తీవ్రమైన ఎండల వల్ల అనర్థాలు...

సూర్యకిరణాలవల్ల శరీరంలో కండరాలు బిగుసుకుపోతాయి. ఎండ తీవ్రత వల్ల ఒంట్లో కండరాలు సంకోచించి, ఒళ్లంతా నొప్పిగా ఉంటుంది. అధిక ఉష్ణోగ్రత కారణంగా కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయం దెబ్బతింటాయి.

చిన్నారులు, వృద్ధుల విషయంలో..

చిన్నారులు, వృద్ధుల విషయంలో మరింత అప్రమత్తత అవసరం. ఎండ తీవ్రత వల్ల వీరిలో దాహం పెరుగుతుంది. కాబట్టి ఎప్పటికప్పుడు మంచి నీరు, గ్లూకోజ్, ఎలక్ట్రోరల్ పౌడర్ వంటివి అందించాలి. చిన్నారులకు ప్రతి అరగంటకు ఒకసారి కొద్దిగా నీళ్లను పట్టాలి. వీలైనంత వరకు వృద్ధులు, చిన్నారులను గాలి ఆడే ప్రదేశాల్లో ఉండేలా చూడాలి. సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు రాకుండా చూడాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

ఎండ తీవ్రత పెరిగే సమయానికి పిల్లలు ఇంట్లోనే ఉండేలా చూడాలి. పిల్లలకు ఎండేముంటుందిలే అని నిర్లక్ష్యం చేయడం అనర్థానికి దారితీస్తుంది. మధ్యాహ్న సమయంలో ఆరుబయట ఆడుకోవడానికి అనుమతించవద్దు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ఆడుకోవడానికి అనుమతినివ్వాలి.యాత్రలకు వెళ్లినప్పుడు స్వయంగా వండుకున్న ఆహారాన్ని తినడం మంచిది.పిల్లలు మొబైల్ ఫోన్లు, ట్యాబ్లకు అవాటు పడకుండా జాగ్రత్త తీసుకోవాలి. రెండు పూటలా స్నానం చేయించి, చెమటను పీల్చే తెల్లని లేత రంగు దుస్తులు వేయాలి. ఇంటి వద్ద ఎండ, వడగాలి తగలని ప్రదేశంలో ఆడుకునేలా చూడాలి. తగినంత నిద్రపోయేలా చూడాలి.

ఈ ఆహారం తీసుకుంటే మంచిది..

వేసవిలో పిల్లలు ఆహారం తీసుకోవడానికి ఇష్టపడరు. చిరుతిళ్లను ఎక్కువగా ఇష్టపడతారు. చల్లని పానీయాలు తాగేందుకే మొగ్గు చూపుతారు. పంచదార కలిపిన జ్యూస్లు, కంపెనీల కూల్ డ్రింక్లు, ఐస్క్రీంలు పిల్లలకు ఇవ్వడం వల్ల డీ హైడ్రేషన్ ప్రభావం పెరుగుతుంది. ఉదయం ఎండ ఎక్కువ కాకముందే అల్పాహారం పూర్తిచేసేలా చూడాలి. బేకరీ, బయటి పదార్థాలు కాకుండా ఇంట్లో చేసిన ఆహారాన్నే అల్పాహారంగా ఇవ్వాలి. రాగి, సజ్జలు తదితర తృణధాన్యాల జావను మజ్జిగ లేదా పాలలో కలిపి ఇస్తే పిల్లలు డీహైడ్రేషన్‌కు గురికారు. వేసవిలో ఏర్పడే పోషకాల లోటును ఇవి భర్తీ చేస్తాయి. అల్పాహారం అనంతరం నిమ్మరసం లేదా ఖర్జూరాలు ఇస్తే జీర్ణశక్తి పెరుగుతుంది. మధ్యాహ్న భోజనంలో తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని అందించాలి. ఆహారంలోనూ, చిరుతిళ్లలోనూ పాలకూర, ఉల్లి, ముల్లంగి, బీట్రూట్, అనాస, మామిడి, కర్బూజా, పుచ్చకాయ, కీరదోస, మజ్జిగ, కొబ్బరినీళ్లు, నిమ్మరసం ఉండేలా చూడాలి. ఉప్పు, నూనెలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తగ్గించాలి. చెమట రూపంలో శరీరం కోల్పోయిన లవణాల్ని భర్తీ చేయడానికి మజ్జిగ, నిమ్మరసంలో ఉప్పు శరీరానికి అందేలా చూడాలి.

పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి..

ఎంబిబిఎస్, చిన్న పిల్లలు, నవజాత శిశువు వైద్య నిపుణులు డాక్టర్ అజ్జ శ్రీనివాస్



సాధారణంగా 40 డిగ్రీలు ఆపై ఉష్ణోగ్రతల వల్ల వడగాలులు వీస్తుంటాయి. వీటివల్ల శరీరంపై స్వేదరంధ్రాలు మూసుకు పోయి శరీరంలోని వేడి, చెమట బయటికి రాకుండా ఉండిపోతుంది. దీంతో శరీరంలో వేడి తీవ్రమై మనిషి అస్వస్థతకు గురవడం, స్పృహ కోల్పోవడం జరుగుతుంది. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు కూడా పోయే ప్రమాదం లేకపోలేదు. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బ నుంచి తప్పించుకోవచ్చు. సాధ్యమైనంత వరకు ఎండ అధికంగా ఉండే సమయంలో బయటికి రావొద్దు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి వస్తే శరీరంపై సూర్యకిరణాలు పడకుండా జాగ్రత్తపడాలి. ప్రతి అర్థగంటకు ఒకసారి నీరు తాగాలి. నూనె పదార్థాలు, కొవ్వు పదార్థాలు తీసుకోకూడదు. వడదెబ్బకు గురైనవారిని, ఎండలో తిరిగి మూర్ఛపోయిన వారిని వెంటనే చల్లటి ప్రదేశానికి తరలించాలి. ముఖంపై మంచినీరు చల్లి, స్పృహ వచ్చిన తరువాత నెమ్మదిగా చల్లటి మంచినీరు తాగించాలి. ఐస్ ముక్కలతో చంకలు, గజ్జల్లో తుడవడం వల్ల శరీర ఉష్ణోగ్రత త్వరగా తగ్గుతుంది. వెంటనే దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించాలి. ఉప్పు, చక్కెర కలిపిన నీళ్ళు, కొబ్బరినీళ్లు, పండ్లరసాలు తాగించాలి. ఎండలో వెళ్లేవారు ఓఆర్ఎస్ ప్యాకెట్లు లేదా మజ్జిగ, అంబలి వంటివి వెంట ఉంచుకోవడం మంచిది.

వడదెబ్బ లక్షణాలు..

వడదెబ్బ తగిలినప్పుడు కొంతమంది మూర్ఛపోతారు.శరీరంలో లవణాలు ఆవిరైపోవడంతో బాగా నీరసించిపోతారు. కొంత మంది డీహైడ్రేషన్కు గురవుతారు.కొందరికి వాంతులు, విరేచనాలు, తీవ్ర జ్వరం తదితర లక్షణాలు కనిపిస్తాయి.

వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థ మేళాలో తృతీయ బహుమతి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వరంగల్‌లో ఈనెల 25,26,27 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థ మేళలో హాస కొత్తూర్ కు చెందిన తెడ్డు రాజన్నకు తృతీయ బహుమతి లభించింది. రాష్ట్ర స్థాయి ఎఫ్‌పిఓ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థ మేళలో తెడ్డు రాజన్నకు చెందిన వేములవాడ రాజన్న ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ తరపున రైతులు పండించిన రెండు రకాల ఉత్పత్తులను ప్రదర్శించారు. వీటిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు మేళాలో ప్రదర్శనకు ఉంచారు. ఇందులో నవారా రైస్ గాను తృతీయ బహుమతి లభించింది. మేళ ముగింపు సందర్భంగా వరంగల్ కలెక్టర్ సత్య శారద, జెడి రవీందర్ చేతుల మీదుగా తెడ్డు రాజన్న బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా తెడ్డు రాజన్న మాట్లాడుతూ నవారా రైస్ అధిక పోషకాలు కలిగి ఉండి, షుగర్ వ్యాధికి తగ్గించడానికి పనిచేస్తుందన్నారు.



బహుమతి అందుకుంటున్న రాజన్న

రైతుల గోస వినని ప్రభుత్వం

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నేడు నగరంలోని ధర్నా చౌక్ లో నిర్వహించిన రైతు సత్యాగ్రహ దీక్షలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని చేసిన హామీలు ఎక్కడిపోయాయని ప్రశ్నించారు. పంటలకు నీరు లేక రైతులు కష్టాల్లో ఉన్నా ప్రభుత్వం చేతులెత్తేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాం సుగర్ ఫ్యాక్టరీ పున్నప్రారంభంపై ప్రభుత్వం మౌనంగా ఉందని విమర్శించారు. అకాల వర్షాలు, కరెంట్ కొరత కారణంగా పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని, ఎకరానికి రూ.30వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరి కోతలు ప్రారంభమైనందున వెంటనే ఐకేపీ కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో బీజేపీ ఇందూరు జిల్లా అధ్యక్షులు, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు,రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు,ఈ మండల నాయకులు, కిసాన్ మోర్చా రాష్ట్ర, జిల్లా, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరియు వివిధ మోర్చాల జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సోదర భావానికి ప్రతీక రంజాన్

- దావత్ -ఏ-ఇఫ్తర్ విందులో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, మతసామరస్యానికి కట్టుబడి ఉంటుందని తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ముస్లిం సోదరులకు దావత్- ఏ- ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం డిచ్ పల్లి మండల కేంద్రంలోని ఘన్పూర్ గ్రామంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్ లో ప్రభుత్వం అధ్వర్యంలో దావత్ -ఏ-ఇఫ్తర్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ అని దేశంలో అన్ని కులాలు మతాలకు గౌరవిస్తు వారి హక్కుల కోసం కృషి చేస్తుందని, అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇఫ్తార్ విందు భోజనం లో పాల్గొనడం సంతోషదాయ కమన్నారు.అంతకు ముందు హాఫిజ్ -ఏ-ఖురన్ (మౌల్వి సాబ్) రంజాన్ మాసం విశిష్టతను వివరించి ప్రత్యేక దూవ చేస్తూ దేశం, రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు .

కార్యక్రమం లో తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్,నిజామాబాద్ ఆర్డిఓ రాజేందర్ కుమార్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, టిపిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్,తహసిల్దార్ ప్రభాకర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సంతోష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ షాదుల్ల, కంచెట్టి గంగాధర్, పోలసని శ్రీనివాస్, చైర్మన్లు తారచంద్ నాయక్, రామ్ చందర్ గౌడ్, డాక్టర్ షాదుల్ల, మైనార్టీ సెల్ అధ్యక్షులు యం డి. ఇబ్రహీం, దావూద్, జాకీర్, చింతల కిషన్, సంతోష్ రెడ్డి, డాక్టర్ జాహూర్, లచ్చమొల్ల దత్తాద్రి,తో పాటు మాస్ జిద్ కమిటీ సభ్యులు హమీద్ పాషా, అహ్మద్,బసీత్, ఇస్మాయిల్, ఖుర్షీద్, సైఫ్, అమేర్ అలీ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.





ఎమ్మెల్యేకు ఫొటోను బహుమతిగా ఇస్తున్న ముస్లింసోదరులు

లీకేజీకి మరమ్మతులు

- నవతెలంగాణ వార్తకు స్పందించిన అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న మండల వాసులు



నవతెలంగాణ-ముప్కాల్

'నీటి లీకేజీని సరిచేయరా అనే శీర్షికతో వచ్చిన వార్తకు స్పందించిన మిషన్ భగీరథ ఏఈఈ బస్వరాజ్ స్థానిక పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం నీటి లీకేజీ పనులను పరిశీలించి పూర్తి చేయించారు. రోడ్డుపై నీటి లీకేజీ వల్ల గత కొంతకాలంగా ఇబ్బందులు పడుతువస్తున్న వాహనదారులు, స్థానికులు పనులు పూర్తి కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను గుర్తించి వార్త రూపంలో అధికారులకు తెలిసేలా చొరవ చూపిన 'నవతెలంగాణ' దినపత్రికకు మండల వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈఈ బస్వరాజ్, ఎంపీడీవో నరేష్ ఆనంద్, పంచాయతీ సెక్రటరీ మల్లేష్ యాదవ్, మిషన్ భగీరథ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

కంజర్ ఉన్నత పాఠశాలకు బీరువాలు అందజేత

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజర గ్రామంలోగల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో లైబ్రరీ రూ.50వేల విలువగల ఐదు అలమారాలను విరాళంగా అందజేసి దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు విజయరావు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం కూడా చాలా ప్రాముఖ్యమైనదని పరిశుభ్రతపై అవగాహన సదస్సును, దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ శిబిరానికి వక్తగా ప్రముఖ దంత వైద్య నిపుణులు రోటరీ సభ్యులు డాక్టర్ కొండా అమర్నాథ్ హాజరై మాట్లాడారు. చేతుల పరిశుభ్రత చాలా ప్రాముఖ్యమైనదని అన్నారు. బ్యాక్టీరియా చేతి నుండి నోట్లోకి వెళ్లి ఆరోగ్యం దెబ్బ తినడానికి ప్రధాన కారణం అవుతుందని తెలిపారు. విద్యార్థులకు దంత పరీక్షలు చేసిచేశారు. ఉదయం, సాయంకాలం దంతాలను శుభ్రం చేసుకోవాలని, అలాగే ఆరునెలకొకసారి దంత చికిత్సలను చేసుకోవాని అన్నారు. అనంతరం విద్యార్థులకు పేస్టులను అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గంగారెడ్డి, కార్యనిర్మాణ అధికారి బిరెల్లి నర్సింగ్ రావు, గుర్ప్రీత్ సింగ్, తులసీదాస్ పటేల్, బాబురావు, పాఠశాల హెచ్ఎం గోపాల్ చారి, సమన్వయకర్త, గోపాలకృష్ణ, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

2లక్షల బీమా చెక్కు అందజేత



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వినియోగదారుడికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద రెండు లక్షల రూపాయల బీమా చెక్కును శుక్రవారం ఎస్బిఐ వినాయకుల బావి బ్రాంచ్‌లో ఖాతాదారు సన్నకాటి వరలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్బిఐ రీజినల్ మేనేజర్ మహేశ్వరి కోలేటి, ఫైనాన్షియల్ మేనేజర్ రాజన్న, బ్రాంచ్ మేనేజర్ ప్రేమ్ కుమార్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | మార్చి 29, 2025 | www.navatelangana.com

వడ్డీ వ్యాపారం చేస్తున్న వారి ఇండ్లల్లో సోదాలు

- కేసులు నమోదు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని తిప్పారం గ్రామంలో ఎలాంటి లైసెన్సులు లేకుండా అక్రమంగా వడ్డీ వ్యాపారం చేసే పలు ఇండ్లల్లో పోలీసులు శుక్రవారం సోదాలు చేశారు. సోలంకి సాయిరాం, ఊగిలే ఆనంద్ రావు, బంగారువాడి బాలయ్య తదితరుల ఇండ్లలో సోదాలు చేసి పలు ఇండ్లలో ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. పై వ్యక్తులు తిప్పారం గ్రామంలో అధిక వడ్డీలకు అప్పు ఇస్తున్నారని వీరివల్ల అదే గ్రామానికి చెందిన అప్పులు వాటిపైన అధిక వడ్డీ కట్టలేక భూములు రాసిచ్చినట్టు నమ్మదగిన సమాచారం మేరకు ఇళ్లను సోదా చేయగా దొరకగా వాటిని స్వాధీన పరుచుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.



సోదాలు చేస్తున్న పోలీసులు

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ విద్య

- రాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం కంప్యూటర్ ద్వారా విద్యాబోధనను ప్రవేశపెట్టనున్న, విద్యార్థులకు భవిష్యత్తులో ఉపయోగపడుతుందని రాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దికుంట ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ద్వారా విద్యా బోధనను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కంప్యూటర్ విద్యను పరిశీలించి, పలు ప్రశ్నలతో విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఆనంద్ రావు, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి, మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్ విద్యను పరిశీలిస్తున్న పరిశీలకురాలుట

ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రతిగడపకూ తీసుకెళ్లాలి

- జై బాపు, జై సంవిధాన్, జై భీమ్ రాష్ట్ర కమిటీ సభ్యులు తాహెర్‌బిన్ హందాన్

నవతెలంగాణ-రెంజల్/ఎడపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలను రాష్ట్ర ప్రజలకు తెలియజేయడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు గడపగడపకూ తీసుకువెళ్లాలని జై బాపు, జై సంవిధాన్, జై భీమ్ రాష్ట్ర కమిటీ సభ్యులు తాహెర్‌బిన్ అందాన్ స్పష్టం చేశారు. సమావేశం ప్రారంభంలోనే వారితో ప్రతిజ్ఞ చేయించారు. శుక్రవారం మండలంలోని సాటాపూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన మహనీయుల త్యాగ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. పల్లెల ప్రగతి కోసం నిరంతరంగా పోరాడిన బాపు ఆదర్శనీయుడని ఆయన అన్నారు. భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎస్సీ, బిసి, ఎస్టి, మైనారిటీలకు రిజర్వేషన్స్ సౌకర్యం కల్పించి వారిని భాగస్వాములు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. వారి అడుగుజాడల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రభుత్వం సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించడంతోపాటు వారికి ఆ పథకాలపై అవగాహన కల్పించడానికి కాంగ్రెస్ నాయకులు గడపగడపకూ ప్రచారం నిర్వహించాలని ఆయన నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇంచార్జ్ సుమన్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మోబిన్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు నాగభూషణంరెడ్డి, జి.సాయిరెడ్డి, జావీద్ ఉద్దీన్, సిహెచ్ రాములు, సురేందర్‌గౌడ్, రియాజ్ బేగ్, గంగా కృష్ణ, నరసయ్య, అసెంబ్లీ కన్వీనర్ కార్తీక్, యువజన మండలాధ్యక్షులు గైని కిరణ్, ఎంఎల్ రాజు, రెంజల్ సింగిల్ విండో చైర్మన్ మొయినుద్దీన్, ఇందిరా దేవి, సోక్కుల సాయిలు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



రెంజల్ : మాట్లాడుతున్న తాహెర్‌బిన్ హందాన్

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి త్వరలో గ్రామస్థాయిలో పాదయాత్ర

ఎడపల్లి : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి త్వరలో గ్రామస్థాయిలో పాదయాత్ర చేపట్టనున్నట్టు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. మండల కేంద్రంలోని విఆర్ఆర్ గార్డెన్‌లో జాతీయ మహానుభావులైన జైబాబు, జై భీమ్, జై సంవిదన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐసిసి నేత, రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామగ్రామాన రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలపై ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం మనందరిపై ఉందని ఆయన అన్నారు. ఇందుకుగాను గ్రామస్థాయిలో పాదయాత్ర కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పులి శ్రీనివాస్ ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులు జాతీయ నాయకులైన జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో క్షేత్రస్థాయిలో వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పులి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎడపల్లి మండలంలో సుమారు 17 గ్రామపంచాయతీలున్నందున గ్రామాల వారీగా చేపట్టనున్న పాదయాత్ర కార్యక్రమాలను త్వరలో వెల్లడిస్తామని ఆయన ప్రకటన చేశారు.

సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి, ఎడపల్లి మండల ఇన్చార్జి యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పులి శ్రీనివాస్‌రావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈరెంటి లింగం, ఎడపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బంజ కామప్ప, బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొబ్బిలి శ్రీనివాస్, రెంజల్ మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సుమన్, యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంద్ర సంజయ్, సీనియర్ నాయకులు, జహీరుద్దీన్, గాంధారి హనుమంత్ రెడ్డి, పరిగె సాయిలు, ఎల్లయ్య యాదవ్, యాసాడ రాజ్ కుమార్, జహీర్ ఖాన్, సరిదాస్, నీరెడ్డి రవికుమార్, ఎడపల్లి మాజీ సర్పంచ్ శంకర్ నాయక్ ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-నిజాంసాగర్

చెట్టుకు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం.. వడ్డేపల్లి గ్రామానికి చెందిన గులాబాలా కిష్టయ్య (30) మద్యానికి బానిసయ్యాడు. ఆరోగ్యం బాగోలేకపోవడంతో వడ్డేపల్లి గ్రామ శివారులో గల అటవీ ప్రాంతంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఎమ్మెల్సీ కవిత రాక

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఈసన్నపల్లి (రామారెడ్డి)లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి దేవస్థాన దర్శనం కోసం నేడు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రానున్నట్లు బిఆర్ఎస్ నాయకులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో మాట్లాడుతూ... బిఆర్ఎస్ శ్రేణులు, అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుల సమావేశం

నవతెలంగాణ-కామారెడ్డి

ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ జిల్లాల అభ్యర్థుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించగా..కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో డీసీసీ వ్యవస్థ మరింత పటిష్టత పార్టీలో ఇక కీలక భూమిక పోషించనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఇందిరా భవన్‌లో 16 రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు.

ఆలయ కమిటీ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా నియమితులైన రామ్ పటేల్‌కు, అలాగే ఆలయ కమిటీ సభ్యునిగా నియమితులైన కైలాస్‌సేట్‌కు మద్నూర్ మండల పౌర సేవా సొసైటీ అధ్యక్షులు ఆర్ సుభాష్ శాలువాలతో ఘనంగా సత్కరించారు.

30న నేరల్‌లో కుస్తీ పోటీలు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని నేరల్ గ్రామంలో ఆదివారం ఉగాది పండుగను పురస్కరించుకొని కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఉగాది పర్వదిన రోజున ప్రతి సంవత్సరం నిర్వహించినట్టుగానే ఉగాది రోజు కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మల్లయోధులు అధిక సంఖ్యలో పాల్గొని నేరల్ గ్రామంలో నిర్వహించే కుస్తీ పోటీలను విజయవంతం చేయాలని గ్రామస్తులు కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల గ్రామంలో సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించినట్టు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కురుమ సాయిబాబా తెలిపారు. ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు చొరవతో మత్తమాల గ్రామ సీసీ రోడ్డు పనులు టెంకాయ కొట్టి పనులు పరంభించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ప్రత్యేక శ్రద్ధతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రూ.15 లక్షల వ్యయంతో మత్తమాల గ్రామం కోసం, గ్రామప్రజల సౌకర్యార్థం ఈ పనులు చేపట్టినట్టు వివరించారు. త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కురుమ సాయిబాబా, ఎంపీడీవో ప్రకాష్, ఏపీవో వినోద్‌గౌడ్, గ్రామ అధ్యక్షులు సాల్మాన్, సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, చంద్రయ్య, చిత్రంజేస్, దావీద్, మాజీ ఉపసర్పంచ్, గ్రామ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పలుచోట్ల ఇఫ్తార్ విందు



నాగిరెడ్డిపేట్ : ఇఫ్తార్‌విందులో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, ముస్లింలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్/గాంధారి

మాల్‌తుమ్మెద సొసైటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఒక పొద్దు విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం లాగే రంజాన్ ఒక్క పొద్దులను పురస్కరించుకొని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ పార్టీ ఇవ్వడం ఆనవాయితీగా వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై మల్లారెడ్డి, మాజీ చైర్మన్ రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శేఖర్, యువత అధ్యక్షుడు శ్రీరామ్‌గౌడ్, కోఆర్డినేటర్ నరసింహారెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు ఇమామ్, గులాం, వెంకట్‌రెడ్డి, సుధాకర్, ఫారూఖ్ సాబ్, అహ్మద్, రషాద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్జాల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

గాంధారి : మండలంలోని గుర్జాల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ పార్టీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పెద్దలు మాట్లాడుతూ.. దేశంలో ఉన్న హిందూముస్లింలందరూ కలిసి మెలిసి ఉండాలని చెప్పారు. ఈ ఇఫ్తార్ పార్టీలో కాంగ్రెస్ నాయకులు ధాత్రికా శ్రీనివాస్, భాస్కర్, సాల్వేరు శీను, మోలుగు రాములు, బట్టు రాజేందర్, రాజు, సంగమేశ్వర్, పోతరాజు గంగారాం, చిటికె శ్యామ్, మోలిసాబ్, మహమూద్, ఆమేర్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరిపించండి

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రఖ్యాత క్రైస్తవ పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై సిబిఐ ద్వారా దర్యాప్తు జర్పాలని, అదేవిధంగా బీహార్ రాష్ట్రంలోని "మహాబోధి బుద్ధ మహావిహార్" మనువాదుల కబంధ హస్తాల్లో ఉందని, అది దేశ బుద్ధిస్టులకే చెందాలని శుక్రవారం అంబేద్కర్ యువజన సంఘం (ఏవైఎస్) ఆధ్వర్యంలో మండల రెవెన్యూ అధికారి కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హెబ్రేబు చర్చి పాస్టర్ సుద్దపల్లి మార్కు మాట్లాడుతూ.. పాస్టర్ ప్రవీణ్ పై మతోన్మాదులు కుట్రపన్ని హత్య చేశారని ఆరోపించారు.

ధాన్యం ఉత్పత్తిలో బాన్సువాడ ఆదర్శం

- ప్రభుత్వ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

వరిసాగులో రాష్ట్రంలోని బాన్సువాడ నియోజకవర్గం అగ్రగామిగా ఉందని, వరి విస్తీర్ణం కొంతకాలంగా గణనీయంగా పెరుగుతోందని, ఆరుగాలం కష్టపడి శ్రమించి పండించిన ధాన్యాన్ని రైతులు, దళారుల చేతిలో మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్, బీర్కూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మన్ కాసుల బాలరాజ్, బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయం ఉత్పత్తిలో దిగుబడిలో రాష్ట్రంలోని బాన్సువాడ నియోజకవర్గం ఆదర్శమన్నారు. బాన్సువాడ నియోజకవర్గం ప్రతి ఆరు మాసాలకు ఒకసారి 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఏ-గ్రేడ్‌కు రూ.2320, బీ-గ్రేడ్‌కు రూ.2300 చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో ఐదు టీఎంసీల నీటిని ఉంచి వచ్చే పంటకు జూన్ మాసంలో నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు నష్టం జరగకూడదని, పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్న సన్నరకం ధాన్యానికి ప్రోత్సాహకరంగా క్వింటాకు రూ.500 బోనస్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, బీర్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల, విండో చైర్మన్ హన్మంత్‌రావు, నాయకులు పెరిక శ్రీనివాస్, అప్పారావు, పల్లికొండ సాయిబాబా, నరసరాజు, తహసీల్దార్ లత, ఎంపీడీవో భానుప్రకాష్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

- సింగిల్ విండో చైర్మన్ రమేష్

నవతెలంగాణ-లింగంపేట్

ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని సింగిల్ విండో చైర్మన్ రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని నల్లమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో సింగిల్ విండో చైర్మన్ సుప్పాల రమేష్ అధ్యక్షతన మహాజనసభను ఏర్పాటు చేశారు. ముందస్తుగా 1-10-2024 నుంచి 28-03-2025 వరకు జమ, ఖర్చులను చదివి రైతులకు వినిపించారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకం 2లక్షలు రానివారికి ఏకకాలంలో ఇవ్వాలని తీర్మానించారు. కొత్తవారికి క్రాప్‌లోన్ ఇవ్వాలని, జూన్ మాసంలో ఇవ్వడానికి తీర్మానం చేశారు. అదేవిధంగా దీర్ఘకాలిక రుణాలు ఓటీఎస్ మార్చి 31 వరకు ముగుస్తుందని, కావున జూన్ 30 వరకు పొడిగించాలని ఎన్‌డిసిసిబి వారికి వివరించారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు ఇవ్వకుండా సొసైటీ ద్వారానే నడపాలని సంఘం సభ్యులు రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సింగిల్‌విండో భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో సంఘం భవనం కొత్తది నిర్మించాలని మహాజనసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ మహాజన సభకు కార్యదర్శి మైపాల్, డైరెక్టర్లు నారాయణ, శ్రీనివాస్, భాగయ్య, సురేందర్, రైతులు, సంఘం సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మెన్

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- అనంతరం ఉపాధి హామీ పనుల పరిశీలన
- మీరొస్తున్నారనే తాగునీరు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఉపాధి కూలీలు

నవతెలంగాణ-తాడ్వాయి

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం తాడ్వాయి మండలంలో పైలట్ విలేజ్‌గా ఎంపికైన సంతాయిపేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మార్కౌట్ చేసి మాట్లాడారు. ఎంపికైన లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాలు నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని సూచించారు. ఒక్కో ఇంటి నిర్మాణం 400 నుంచి 500 స్క్వేర్ ఫీట్ స్థలంలో చేపట్టాలన్నారు.

అనంతరం భీమేశ్వర ఆలయ సమీపంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. తాము 60 రోజులుగా కూలి పనులు చేసినప్పటికీ కూలీ డబ్బులు రాలేదని తమ వ్యక్తిగత ఖాతాలలో జమ చేసేలా చూడాలని కలెక్టర్ దృష్టికి కూలీలు తీసుకువచ్చారు. పనులు చేపట్టే స్థలంలో కలెక్టర్ వస్తారని ఈరోజే తాగునీరు తెచ్చారని కూలీలు తెలిపారు. తాము చేపట్టిన పనులకు తగినంత కూలీ రావడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. నీడతెరలు కొంతమంది కూలీలకే వేశారని తెలిపారు. నర్సరీలలో పూలు పండ్ల మొక్కలు అధికంగా పెంచి ఒక్కో ఇంటికి అందజేసేలా చూడాలన్నారు. అధికారుల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనంతరం శ్రీ భీమేశ్వర ఆలయాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధి గురించి పూజారులు గ్రామస్తులు కోరగా రోడ్డు సౌకర్యం, నీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ పిడి మత్రి సురేందర్, సీఐ సంతోష్ కుమార్, మండల ప్రత్యేక అధికారి రాజారాం, హౌసింగ్ పీడీ, ఇన్చార్జి తహసిల్దార్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీ ఓ సవిత రెడ్డి, హౌసింగ్ ఏఈ, విద్యాశాఖ అధికారి రామస్వామి, ఎస్ఐ కొండల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుతారి సాయవ్వ నారాయణ, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్

నాగాపూర్‌లో పశువైద్య శిబిరం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగాపూర్ గ్రామంలో శుక్రవారం కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ శిబిరంలో పశువైద్య సిబ్బంది సహకారంతో గ్రామంలోని పాడి పశువులకు సంబంధించిన వైద్య సేవలు, కావాల్సిన మందులతో చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం మార్కెట్ కమిటీ పరిధి లోని గ్రామాలలో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తామని, పాడి రైతులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, డైరెక్టర్ భూత్ పురం మహిపాల్, మార్కెట్ కమిటీ సూపర్ వైజర్ రాజు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సుంకేట రవి, కమ్మర్ పల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ రావ్, డాక్టర్లు వసంత్, గౌతమ్ రాజ్, వెటర్నరీ అసిస్టెంట్ చిత్ర సాయి, గోపాల మిత్ర సిబ్బంది స్పరణ్, స్వప్న, మార్కెట్ కమిటీ సిబ్బంది, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాలకు ముస్తాబైన నల్ల పోచమ్మ ఆలయం

- ఈనెల 30 నుంచి ఉగాది ఉత్సవాలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల నల్ల పోచమ్మ ఆలయం ఉగాది ఉత్సవాలకు ముస్తాబైంది. నల్ల పోచమ్మ ఉత్సవాలు ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రతి యేటా నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలోని నల్లపోచమ్మ ఆలయం వద్ద ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలు, జిల్లాల నుంచి ఈ ఆలయానికి ప్రజలు పెద్దఎత్తున తరలివస్తారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ నెల 30న ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించనున్నారు. రెండవ రోజున బోనాల పండుగ, మూడో రోజున రాత్రి రథోత్సవం నిర్వహిస్తారు.



ముస్తాబైన ఆలయం